క్లుప్తంగా

ఎల్లమ్మ జాతరలో కుస్తీపోటీలు


బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని రేణుకా ఎల్లమ్మ జాతరలో భాగంగా శనివారం కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పోటీలకు తిలకించారు. అనంతరం గెలుపొందినవారికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ చౌహాన్, రవీందర్‌నాయక్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శైలజ, నాయకులు పెంటారెడ్డి, రంగారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు


యువకులతో నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామానికి చెందిన పలువురు యువకులకు నీలం మధు సమక్షంలో శనివారం ఎన్ఎంఆర్ యువసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు వెంకటేశం, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలి


సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలు

కొండాపూర్(సంగారెడ్డి): వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాబురావు అన్నారు. కొండాపూర్‌లోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారానికి 6వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఐకేపీ వీఓఏల మండల ప్రధాన కార్యదర్శి శీను, మండల అధ్యక్షులు సంజీవులు, సహాయ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

గెల్లు శ్రీనివాస్‌కు సన్మానం


గెల్లు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఇటీవల తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా నియామకమైన తెలంగాణ ఉద్యమకారుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నేడు బసవేశ్వరుడి జయంతి

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌తో పాటు పీపడ్‌పల్లి, చిమ్నాపూర్, హస్నాబాద్, సింగితం, కుసునూర్, తదితర గ్రామాల్లో ఆదివారం విశ్వగురు బసవేశ్వరుడి జయంతిని నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని బసవేశ్వర విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి బజవేశ్వరుడి జెండాలు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రాయికోడ్‌లో శోభాయాత్ర, పీపడ్‌పల్లిలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


జోగిపేట: రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్


జహీరాబాద్ టౌన్: ముస్లింలతో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు


నారాయణఖేడ్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


జిన్నారం: పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు


ఝరాసంగం: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు, నాయకులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

జిల్లావ్యాప్తంగా పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మసీదులు, ఈద్గాల్లో భక్తిశ్రద్ధలతో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లా నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పటాన్‌చెరు: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు: రంజాన్ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్, నాయకులు


సంగారెడ్డి: హాస్టల్‌గడ్డ ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


జోగిపేట: ముస్లింలకు ఫ్రూట్‌సాల్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ చిట్టిబాబు


కోహీర్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కల్హేర్: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న నాయకులు


సదాశివపేట పట్టణంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


న్యాల్‌కల్: ముంగిలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


రామచంద్రాపురం : రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్


కంగ్టి: తడ్కల్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొండాపూర్(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్‌డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎస్ఎఫ్‌డీ (స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ భూమి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మొదటిసారిగా అంతర్జాతీయ భూమి దినోత్సవాన్ని 1970లో ప్రకటించారన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలను విరివిగా నాటాలన్నారు. భూమి వివిధ రకాలుగా కలుషితమవుతుందని, ఫలితంగా భూమి సారవంతం కోల్పోయి వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. భూమిపై నివసిస్తున్న ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా వహించాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి అంటే పెద్ద పెద్ద భవనాల ఏర్పాటు, రోడ్ల నిర్మించడం కంపెనీల నిర్మించడం కాదు అని ప్రకృతితో మమేకమై ప్రకృతికి హాని కలిగించకుండా కొనసాగినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధించినట్లు అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తానాజీ, వెంకట్, నిఖిల్, రాకేష్ పాల్గొన్నారు


కొండాపూర్: మాట్లాడుతున్న చంద్రశేఖర్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో

జహీరాబాద్ టౌన్: జనవిజ్ఞాన వేదిక, సీడియా సంస్థల ఆధ్వర్యంలో శనివారం భూమి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాలకు సహజవనరులను ఇష్టానుసరంగా వాడకం ద్వారా మానవాళి మనుగడకు ఆధారమైనా నింగి, నీరు, గాలి, నీరు కలుషితం అయ్యాయన్నారు. పరిశ్రమలు, వాహనాలు మొదలైన వాటినుంచి వెలువడుతున్న క్లోరోఫ్లోరో కార్బన్లు భూగ్రహాన్ని వేడెక్కిస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని, పెట్రోలియం, సహజ వాయువులాంటి వనరుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సుష్మా, సౌజన్య, మాధవి, శిఫా, సబా, మెహక్, క్రిష్ణవేణి, అనురాధ, ప్రీతి పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల బాలుర కళాశాలలో శనివారం స్పార్క్ లెప్ రెజ్లింగ్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్ ప్రారంభించారు. క్యాంపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఏకలవ్య వసతి గృహాలకు సంబంధించి ఉమ్మడి 10 జిల్లాల నుంచి విద్యార్థులు 90 మంది పాల్గొంటున్నారని, ఈ శిబిరంలో 5వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ రెజ్లింగ్ శిబిరం ఈనెల 22 నుంచి మే 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శిబిరం ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, పీడీ లాలు, రెజ్లింగ్ కోచ్ వినయ్‌కుమార్, పీఈటీ శాంతి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలురు)లో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం స్పోర్ట్స్ క్యాంపు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సాంబ్యానాయక్, ఉప సర్పంచ్ సంజీవ, వార్డుసభ్యుడు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరంలో 200 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. శిబిరం 15 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. క్యాంపు అబ్జర్వర్లుగా లక్ష్మణ్, క్రికెట్, బాస్కెట్‌బాల్ కోచ్‌లుగా మహేష్, విష్ణు, శ్రీనివాస్, సందీప్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.


కొండాపూర్: శిక్షణ శిబిరంలో విద్యార్థులు


జిన్నారం: స్పోర్ట్స్ క్యాంపులో విద్యార్థులు

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు

నారాయణఖేడ్: రోడ్లపై ధాన్యం ఆరబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, కుప్పలుగా వేయడం ద్వారా వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కొద్దిరోజుల క్రితం ఖేడ్ మండలంలోని హన్మాన(జి)వద్ద రోడ్డుపైన ధాన్యం కుప్ప వేయగా రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి కుప్పను ఢీకొని మృతి చెందాడని గుర్తు చేశారు. ధాన్యం కుప్ప వేసి ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

'సోషలిజంతోనే మానవాళికి విముక్తి'

కొండాపూర్(సంగారెడ్డి): సోషలిజంతోనే మానవాళికి విముక్తి లభిస్తుందని డివైఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. సంగారెడ్డిలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటిసారిగా పెట్టుబడిదారి వ్యవస్థను కూల్చి సమసమాజం సోషలిజంను నిర్మించిన యోధుడు లెనిన్ అని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ లక్ష్యాలలో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఉన్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు, నిరుద్యోగులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్, సహాయ కార్యదర్శి రాజేష్, నాయకులు మల్లేష్, దుర్గప్రసాద్, హరీష్ మైపాల్, నితిన్, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్బాస్

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

శివ్వంపేట(నర్సాపూర్): వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యారెడ్డి, ఎస్ఐ రవికాంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గోమారం గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడదెబ్బ తగలకుండా హోమియోపతి మందు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రానున్న కాలంలో ఎండలు అధికంగా ఉంటున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లాలని తప్పనిసరి వెళ్లాల్సి ఉంటే ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ మెదక్ రీజియన్ కో ఆర్డినేటర్ రాకేష్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రామేశ్వరం చండి రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు కుంట లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.


మందు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రవికాంత్ రావు

వైభవంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద పురోహితులు ఉమాశంకరశర్మ రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యం వద్ద భ్రమరాంబ మల్లికార్జునస్వామి, విద్యాసరస్వతీదేవికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దీంతో పాటు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు అన్నదానం**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మంజీర క్యాంపస్ రామలింగేశ్వర ఆలయంలో బసవ జయంతిని పురస్కరించుకొని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6:30 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం



మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ నాయకులు ఎడ్ల రమేశ్ శనివారం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎడ్ల రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భరత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి**



పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ **వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం కృత్తికానక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పాండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి విద్యాసాగర్, భక్తులు పాల్గొన్నారు.

◆ **వీరశైవ లింగాయత్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**



నారాయణఖేడ్: బసవ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లోని బసవ మంటపంలో శనివారం వీరశైవ లింగాయత్ యువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200మంది జంగమ సమాజ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఖేడ్ నియోజకవర్గ జంగమ సమాజ్ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బసవేశ్వరుడి బోధనలను ఆచరిస్తూ సన్మార్గంలో నడవాలని సూచించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాకేష్ షెట్కార్, సంగమ సమాజ్ బాధ్యులు రేవణ్ణ, శ్రీశైలం, నరేష్ స్వామి, జగదీష్, సిద్దయ్య, విజయ్ కుమార్, ఓంకార్, సిద్దేశ్వర్, ప్రకాష్ పాల్గొన్నారు.

◆ **వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు**

సంగారెడ్డి టౌన్: టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్ శనివారం సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ కందాడై వరదాచార్యులు చింతా ప్రభాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

◆ **రెండో రోజుకు ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణ**

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్‌లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లకు ఇస్తున్న శిక్షణ శనివారంతో రెండో రోజుకు చేరుకుంది. ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం, డీఎం మల్లేశయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లు డ్రైవర్లు, కండక్టర్లేనని తెలిపారు. సురక్షిత ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లోనే సాధ్యమని వివరిస్తూ సంస్థ ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

◆ **అమర జవాన్లకు నివాళి**

జహీరాబాద్: అమర జవాన్లకు జీకాట్ బృందం నివాళులు అర్పించింది. శనివారం జహీరాబాద్ పట్టణంలోని బీదర్ క్రాస్‌రోడ్డు వద్ద అమర జవానుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఢిల్లీ వసంత్, సభ్యులు జనార్దన్, మాధవరెడ్డి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

◆ **శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలి**



కొండాపూర్(సంగారెడ్డి): ముస్లింలు, క్రిస్టియన్ల శ్మశానవాటికకు ప్రభుత్వం ఇటీవల 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, హిందువులకు కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు అన్నారు. శనివారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం ముస్లింలు, క్రిష్టియన్‌లకు మాత్రమే శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించి హిందువుకు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హిందువులకు శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని కోరారు. సమావేశంలో బీజేపీ కౌన్సిలర్ మందుల నాగరాజు, నాయకులు ముత్తిరెడ్డి, శ్రీకాంత్, విజయ్, చిన్న పాల్గొన్నారు.